క్లుప్తంగా

మంగపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లిన ఎంపీఓ

వాజేడు: స్థానిక ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నాయుడు మంగపేట ఎంపీడీఓగా డిప్యుటేషన్‌పై వెళ్లాడు. మంగపేట ఎంపీడీఓ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శ్రీకాంత్ నాయుడిని డిప్యుటేషన్‌పై ఎఫ్ఏసీ ఎంపీడీఓగా బదిలీ చేశారు. వాజేడు ఎంపీఓ బాధ్యతలను కూడా వాజేడు ఎంపీడీఓ విజయకు ఉన్నతాధికారులు అప్పగించారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం



వెంకటాపురం(కె): పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండలంలోని యాకన్నగూడెం, ముకునూరుపాలెం, దానవాయిపేట గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం భవ్యశ్రీ వర్షాకాలం సీజన్‌లో ప్రతి ఒక్కరూ దోమ తెరలను ఉపయోగించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీల అడ్డగింత



వాజేడు : మండలంలోని చెరుకూరు గ్రామం వద్ద బుధవారం ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డగించారు. ఇసుకలారీల మూలంగా రహదారులు ధ్వంసమవుతున్నాయని, వాటి మరమ్మతులకు అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు గుంతలమయంగా కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు వాపోయారు.

విషజ్వరంతో మహిళ మృతి



కాంచన (ఫైల్)

వాజేడు : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బొగ్గుల జయరామ్ భార్య కాంచన(50) విషజ్వరంతో బుధవారం భద్రాచలంలో మృతి చెందింది. మూడు రోజులుగా జ్వరం వస్తుండటంతో ఏటూరునాగారంలోని ప్రైవేట్ వైద్య శాలలో వైద్యం చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని భర్త జయరామ్ తెలిపాడు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్



ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి మోసం చేస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు బర్లపురి నరేశ్, పల్లా బుచ్చయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి, స్పెషల్ డీఎస్సీ,జాబ్‌క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, వావిలాల జనార్దన్, గండేపల్లి సత్యం, వీనుకోలు చక్రవర్తి, బాసాని సుగుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని సుందరయ్య కాలనీలో బుధవారం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తరుణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమతెరలను విధిగా వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెడికల్ కిట్లను వంద కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో శేఖర్, లలిత, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కామేశ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

‘మత్తు’తో జీవితం చిత్తు

● సీఐ శ్రీనివాస్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం : మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలతో విద్యార్థుల భవిష్యత్ బుగ్గిపాలవుతుందని స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంపై జరిగే నష్టాలను బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు నివారించడంలో ముందుండాలన్నారు. డ్రగ్స్ వాడకంతో యువత మెదడు చురుకుదనాన్ని కోల్పోయి శరీరంలోని అవయవాలన్నీ చెడిపోతాయన్నారు. దీంతో డ్రగ్స్‌కు పూర్తిగా బానిసై చివరికి జీవితాన్ని కోల్పోతారని తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల యువత జీవితం అంధకారంలోకి వెళ్లడమే కాక వారి కుటుంబాలతో పాటు సమాజం కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడంలో విద్యార్థులు యువత సామాజిక బాధ్యతగా వహించి సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడినా, విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సరైన పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భగవద్గీత

ఏటూరునాగారం: విటమిన్ ఏ లోపం లేకుండా విద్యార్థులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐకేర్, శరత్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈతరం పిల్లలకు కంటి చూపు లోపిస్తోందని, సరైన పోషకాలు తీసుకోకపోవడం వల్ల, సెల్‌ఫోన్ తరుచూ వాడడంతో కంటి చూపు దెబ్బతింటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని కోరారు. యువత నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చెడువ్యసనాలకు దూరంగా ఉండి మంచి అలవాట్లతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, పవన్‌రాజ్, అనిల్ కుమార్, అశోక్‌కుమార్, శంకర్, భిక్షం, రాజ్‌కుమార్, ఉపేందర్, రామకృష్ణ, కార్తీక్, పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జాజ చంద్రం, గౌరమ్మ, నాయకులు దిడ్డి మోహన్‌రావు, వసంతరావు, ఎండీ రఫీక్, కొర్నెబెలి శేషగిరి, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

గ్రామానికి రుణపడి ఉంటా



రిటైర్డ్ ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: ఏటూరునాగారంలోని పిల్లలందరూ నా పిల్లలే అన్నట్లుగా భావించి ఏకంగా 32 సంవత్సరాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేసిన ఆ గ్రామానికి, జెడ్పీహెచ్‌ఎస్‌కు రుణపడి ఉంటానని విశ్రాంత ఉపాధ్యాయురాలు పానుగంటి వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయానికి రూ.25 వేల విలువగల మైక్‌సెట్‌ను బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్‌కు అందజేశారు. అనంతరం ఈ ఏడాది ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. తను విధులు నిర్వహించిన పాఠశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా బ్యాండ్‌మేళాన్ని బహూకరించారు. హ్యాండ్‌బాల్ విభాగంలో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి బొమ్మరాజు శివాజీకి రూ.10వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను బతికున్నంత వరకు నా వంతు సహాయంగా పాఠశాలకు, నా దగ్గర చదువుకున్న విద్యార్థులకు, ప్రజలకు ఏదో ఒక రకంగా సహాయపడతానని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెండ్యాల ప్రభాకర్, సాయిని మహేష్, సింధు, నూతి రమేష్, ముంద్రాతి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

వాజేడు: మండలంలోని జగన్నాథపురం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న పీర్ల స్వప్న, ఆమె భర్త ఎర్రబాబుకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వాజేడులో ఉంటున్న స్వప్నను ఉదయం తన భర్త వెంకటాపురం(కె)కు పంపించడానికి ద్విచక్రవాహనంపై జగన్నాథపురం గ్రామానికి తీసుకొచ్చాడు. మలుపు తిరుతున్న క్రమంలో జాతీయ రహదారిపై మలుపుకు ఎదురుగా ఒక ఆటో వచ్చి నిలబడింది. అటుగా వస్తున్న కారు ఆటోను తప్పించే క్రమంలో బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో వాహనంపై ఉన్న స్వప్న, ఆమె భర్త కిందపడడంతో స్వప్న తలకు బలమైన గాయాలు కాగా ఎర్రబాబు కుడి కాలు విరిగింది. 108 వాహనంలో ఇద్దరిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వప్న పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

నష్టపరిహారం చెల్లించాలంటూ ఆందోళన



షాపు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

భూపాలపల్లి అర్బన్: గత నెలలో భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వారికి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన నష్టపరిహారం కోసం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి ప్రాంతంలో మణికంఠ ట్రేడర్స్ (బియ్యం వ్యాపారి దుకాణం) ఎదుట బుధవారం బాధిత కుటుంబాలకు చెందిన మహిళలు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత నెల 9న కమలాపూర్ గ్రామశివారులో రేగళ్ల నరేష్, ప్రమోద్‌లు మేడారం నుంచి భూపాలపల్లికి వస్తుండగా ఇన్నోవా వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరు మృతి చెందిన సమయంలో బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చెల్లిస్తామని, ప్రమాదానికి కారణమైన ఇన్నోవా వాహనం యజమాని అంగీకరించాడు. అయితే ఇవే డబ్బులు స్థానిక బియ్యం వ్యాపారి మహేష్‌రెడ్డితో బాధిత కుటుంబ సభ్యులు ఒప్పందం చేసుకున్నారు. ఇంత వరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ. 3 లక్షలు చెల్లించారు. మిగతా డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ బియ్యం దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే మృతుడి భార్య గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న ఎస్సై సుధాకర్ ఆమె చేతిలో నుంచి గడ్డిమందు డబ్బాను లాక్కోవడంతో ఆమెకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో సమస్య పరిష్కారం కోసం స్థానిక పోలీసు అధికారులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి, బాధిత కుటుంబాలకు కొంతమేరకు డబ్బులు చెల్లిస్తామమని హామీ ఇవ్వడంతోనే బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

ఏఎస్సైకి ఎస్సైగా పదోన్నతి



చిట్యాల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్సై సాతు ఈశ్వరయ్య ఎస్సైగా ప్రమోషన్ పొందాడు. ఈ సందర్భంగా బుధవారం భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే చేతుల మీదుగా 2 స్టార్స్, ప్రమోషన్ పత్రం అందజేశారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రయ్య

మల్హర్: రెండున్నరేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండలంలోని కొండంపేట-1, కేశారంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో డీఎల్‌పీఓ వీరభద్రయ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బుధవారం అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లల శారీరకంగా, మానసికంగా, సాఫిక అభివృద్ధి తోడ్పడే విధంగా విద్యను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



దేవ్‌సింగ్-వసంత దంపతులను సన్మానిస్తున్న డీఈఓ పాణిని

ములుగు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బానోత్ దేవ్‌సింగ్ రిటైర్మెంట్ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవ్ సింగ్ - వసంత దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989 సంవత్సరంలో ములుగు మండలంలోని చిన్న గుంటూరుపల్లిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన దేవ్‌సింగ్ 2006వ సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారని అన్నారు. ప్రస్తుతం ములుగు జిల్లా కేంద్రంలోని బాలుర జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు ,డాక్టర్ పోరిక రవీందర్, డాక్టర్ బాలోజీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ లాల్, డాక్టర్ వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేటకోసం విద్యుత్ తీగలు అమర్చడం నేరం



మాట్లాడుతున్న సీఐ రవీందర్

గోవిందరావుపేట: వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చడం, రైతులు తమ పంటల సంరక్షణకు విద్యుత్ తీగలను అమర్చి ఎదుటి వారికి ప్రాణాపాయం కల్గించే విధంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని పస్రా సీఐ రవీందర్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వన్యప్రాణుల వేట చేపట్టే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సంరక్షణకు పత్యామ్నాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

రామదాసు స్ఫూర్తితో ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

గోవిందరావుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వీరపనేని రామదాసు స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. బుధవారం గోవిందరావుపేటలోని కమ్మ ఫంక్షన్ హాల్‌లో రామదాసు-వెంకటసుబ్బమ్మ నాల్గో వర్ధంతిని నిర్వహించారు. ముందుగా వారి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి రామదాసు అని అన్నారు. తను జీవితాంతం పేద, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్, తుమ్మల వెంకట్‌రెడ్డి, డాంగే, కృచేవ్, చంద్రశేఖర్, రాజేందర్, సాంబశివ, రఘుపతి, ఆగిరెడ్డి, చిట్టిబాబు, దావూద్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ములుగు: ఈ నెల 26న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మంత్రి సీతక్క తనయుడు ధనసరి సూర్య పుట్టిన రోజు సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ నేతలు ఆకుతోట అన్వేష్, నేపాల్‌రావు, కుక్కల నాగరాజు, మధు కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన యువజన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఎమ్మెల్యే (మంత్రి) క్యాంపు కార్యాలయంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సహాయంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీజేపీ ఎంపీలతో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న ఎండీ చాంద్‌పాషా

ములుగు: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఒక్క రూపాయి కేటాయించకపోవడం బాధాకరమని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరఫున తెలంగాణ నుంచి ఉన్న 8 మంది ఎంపీలతో ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా ఆరోపించారు. బుధవారం జరిగిన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో అనుకున్న విధంగా సమ్మక్క-సారలమ్మల మేడారం మహాజాతరకు జాతీయ హోదా దక్కలేదని అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలకు ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉన్న తెలంగాణలోని పర్యాటకప్రాంతాలు, ప్రజల డిమాండ్ మేరకు రైల్వేలైన్ విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు కలిసి విన్నవించినా కేంద్రం స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి, మాజీ ఎంపీటీసీ మావురాపు తిరుపతి రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్ రెడ్డి జిల్లా మత్స్య సంఘం అధ్యక్షుడు కంబాల రవి, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, ఎండీ షకీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్ , కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎండీ అప్సర్ పాషా, రాజు, రవీందర్, బోయిని రాజు, జక్కుల రమేష్, సలీం, పాల్గొన్నారు.

పైపుల్లో చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న జేసీబీ యంత్రం

మహాముత్తారం: మండలంలోని కేశవాపూర్ సమీపంలోని లోలెవల్ కాజ్‌వేలోని పైపుల్లో ఇటీవల కురిసిన భారీవర్షాలకు చెత్త, కర్రలతో పైపులు నిండిపోయాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా నీరు కాజ్‌వేపై నుంచి పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన మండల అధికారులు పైపుల్లో పేరుకుపోయిన చెత్తను, కర్రలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. దీంతో బుధవారం కార్యదర్శి జేసీబీ సాయంతో పైపుల్లో పేరుకుపోయిన చెత్త, కర్రలను తొలగించి నీరు పైపుల ద్వారా వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆ హరితవనం

● ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మొక్కల పెంపకం
● చూపరులను ఆకట్టుకుంటున్న చెట్లు



వేశాలకుంట కట్టపై చూపరులను ఆకట్టుకుంటున్న చెట్లు

టేకుమట్ల : మండలంలోని పంగిడిపల్లి-ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులోని వేశాలకుంట కట్టపై గత యేదాది హరితహారంలో భాగంగా అప్పటి సర్పంచ్ కాసర్ల ప్రియాంకమహాజన్ ప్రత్యేక చొరవతో నాటిన మొక్కలు కుంటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుంట కట్టపై ఇరువైపులా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి చూపరులను ఆకట్టుకుంటుంది. కుంట కట్టను ఎక్కేందుకు మెట్లు, సేద తీరేందుకు బెంచీలను సైతం కట్టపై ఏర్పాటు చేయడంతో హరితవనంలో పాదచారులు, వాహనదారులు కట్టపై కాసేపు సేద తీరుతున్నారు. అంతే కాకుండా గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కల పెంచడమే కాకుండా వాటి రక్షణకు ప్రాధాన్యతనిస్తూ హరిత వనం ఎదుగుదలలో ప్రత్యేక దృష్టి సారించి జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంగిడిపల్లి మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా నిలిచింది.

పోలీస్‌స్టేషన్‌లో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న ఎస్సై, సీఆర్‌పీఎఫ్ పోలీసులు

మహాముత్తారం: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా బుధవారం ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు భారీ సంఖ్యలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.